ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 30 జూన్ 2025

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 24.0

ఎమ్మెల్యే లెటర్ లేదా..?

- పక్కన ఉండండి
- కౌన్సెలింగ్‌లో డీడీ హల్‌చల్
- వెనుక ఉన్నోళ్లకు కోరుకున్న స్థానాలు
- సిఫార్సుల ముసుగులో అధికారుల బిజినెస్
- లబోదిబోమన్న సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు



సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లపై రుబాబు చూపుతున్న డీడీ

అనంతపురం విద్య, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నీపేరు ఏమిటీ..? సార్ నాపేరు ఫలానా అనివెల్ఫేర్ అసిస్టెంట్ అనగానే.. చూడప్పా.. ఈయన పేరు మీద ఎమ్మెల్యే, ఇతర నేతల నుంచి ఏమైన లెటర్ ఉందేమో..? ఉందిసార్ అంటే.. ఓకే ఏ ప్లేస్ తీసుకుంటావో తీసుకో.. లేదుసార్ అంటే.. అయితే మీరడిగినప్లేస్ లేదు.. ఇదిగో ఇది ఉంది తీసుకొనిపో.. అంటూ సోషల్ వెల్ఫేర్‌శాఖ డీడీ బదిలీల కౌన్సెలింగ్‌లో హల్‌చల్ చేయడం తీవ్ర విమర్శలకు దారితీయడంతో పాటు పాలకులపైనా అసంతృప్తి కనిపించింది. సీనియార్టీ ప్రకారం అన్ని ఖాళీలు చూపించాల్సి ఉంది. ముందు వరుసలో ఉన్న వారు అడిగిన స్థానాలు ఇవ్వలేదు. వారు అనుకున్నవారికి సీనియార్టీ జాబితాలో వెనుక ఉన్నా కోరుకున్న స్థానాలు ఇచ్చారు.

ఉదాహరణకు కొన్ని..

సీరియల్ నెంబరు 14.. ర్యాంకు నెంబరు 1468..ఈమెకు కందుకూరు ఇచ్చారు. మరో ఆమెది సీరియల్ నెంబరు 57, ర్యాంకు నెంబరు 1291. ఈమెకు నరసనాయునికుంట కేటాయించారు. మరో మహిళది సీరియల్ నెంబరు 97, ర్యాంకు నెంబరు 1287. ఈమెకు కక్కలపల్లి ఇచ్చారు. మరో వ్యక్తిది సీరియల్ నెంబరు 86, ర్యాంకు నెంబరు 1214.. ఇటుకలపల్లి కేటాయించారు. అంతకు ముందు సీరియల్ నెంబరులో ఉన్నవారందరూ ఆప్లేస్‌లను చూపించి ఇవ్వాలని వేడుకున్నా డీడీ కనికరం చూపలేదు. ఈ తతంగం అంతా ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సచివాలయాల సోషల్‌వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియలో కొనసాగింది. డీడీ రామాంజనేయులు కౌన్సెలింగ్ హాలులో అందరి సమక్షంలోనే బహిరంగంగా వ్యవహరించిన తీరు చూసి సిబ్బంది అవాక్కయ్యారు. అన్ని నియోజక వర్గాల్లోనూ అనుకూలమైన స్థానాలకు ఇదే పరిస్థితి నెలకొంది.

కలెక్టర్ చెప్పినా మారని డీడీ తీరు

జిల్లా యంత్రాంగం ఆయా శాఖల పరిధిలో ఉన్న సచివాలయాల ఉద్యోగులకు బదిలీల ప్రక్రియ చేపట్టింది. సోషల్‌వెల్ఫేర్ అసిస్టెంట్లకు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ బదిలీలు నిర్వహిస్తోంది. శనివారం అంబేడ్కర్ భవన్‌లో కౌన్సెలింగ్ చేపట్టగా.. బదిలీల జాబితాలో ఉన్నవారు హాజరయ్యారు. సీనియార్టీ ప్రకారం అడిగిన స్థానాలు ఇవ్వకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్లు తిరుగుబాటు చేశారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగడంతో ఆదివారానికి వాయిదావేశారు. చివరకు కలెక్టర్ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించి సచివాలయాల ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. కానీ, సోషల్ వెల్ఫేర్ శాఖ డీడీ మాత్రం బదిలీల సమయంలో నిబంధనలను గాలికి వదిలేసి వ్యవహరించారు. దీంతో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆవేదన చెందుతూనే.. ఎదురుతిరిగితే ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయోని భయపడి డీడీ చెప్పినమేరకు ప్లేస్‌లు తీసుకొని వెళ్లారు. ఇదేమి న్యాయమని అడిగిన

(మిగతా 7లో...)

పనులా... పథకాలా..?

- చెరువుల అభివృద్ధికి జీఎస్‌టీ అడ్డు
- రిజిస్ట్రేషన్ ఉంటేనే బిల్లులు
- జీఎస్‌టీ చేయించుకుంటే పథకాలు వర్తించవని అధ్యక్షుల వెనకడుగు
- నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు



కొటిపి చెరువుకట్టపై ఏపుగా పెరిగిన ముళ్లకంపలు

హిందూపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో చెరువుల అభివృద్ధికి రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదు. దీంతో చెరువుల్లో కంపచెట్లు పెరిగిపోయాయి. చెరువు కట్టలపై ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి. మరువలు కుంగిపోయాయి. తూములు లీకవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక చెరువుల మరమ్మతులపై దృష్టి సారించింది. వర్షాకాలం ప్రారంభం కావడంతో చిన్నాచితకా పనులు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఆ పనులకు జీఎస్‌టీ కారణంగా ఎవరూ ముందుకు రావట్లేదు. చెరువు సంఘం అధ్యక్షులకు జీఎస్‌టీ ఉంటేనే పనులు అప్పగిస్తారు. జీఎస్‌టీ చేయించుకుంటే సంక్షేమ పథకాలు రద్దవుతాయని వారు ముందుకు రావట్లేదు. దీంతో చెరువు పనులు ప్రారంభం కాలేదు.

పనులకు బ్రేక్

జిల్లాలో మొదటి విడత కింద చెరువుల మరమ్మతుల కోసం రూ.2కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రూ.60 వేలు మొదలుకుని రూ.4లక్షలదాకా ఒక్కో చెరువుకు మంజూరైంది. చెరువుకట్టపై ఉన్న ముళ్లకంపలు తొలగించడం, మరువలు, తూముల లీకేజీల మరమ్మతులు, చెరువుకట్ట ఎక్కడైనా లీకేజీ ఉంటే వాటికి సంబంధించిన పనులు వేగవంతంగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రూ.10లక్షలలోపు పనులను నామినేషన్ పద్ధతిలో ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో చెరువు సంఘం అధ్యక్షులు ఎగిరిగంతేశారు. జీఎస్‌టీ ఉండాలని ప్రభుత్వం అనడంతో వారు ఉసూరుమన్నారు.

నిధులు మంజూరైనా..

జిల్లాలో 120 చెరువులకు సంబంధించిన పనులను ప్రారంభించాలని సూక్ష్మ జలవనరుల శాఖ (మైనర్ ఇరిగేషన్) అధికారులు.. చెరువు సంఘం అధ్యక్షులను బతిమిలాడుతున్నారు. అయినా ఏ ఒక్కరూ పనులు చేయడానికి ముందుకురావట్లేదు. ఓవైపు ప్రభుత్వం వెంటనే పనులు చేయాలని ఆదేశిస్తుండడం, మరోవైపు వర్షాకాలం ముంచుకొస్తుండడంతో అధికారులు డోలాయమానంలో పడ్డారు. ఈ విషయాన్ని కొంతమంది జలవనరుల శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు.

జీఎస్‌టీ వద్దు

చెరువు సంఘం అధ్యక్షులుగా ఎన్నికైనవారు దాదాపుగా అందరూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన రైతులే. వారు జీఎస్‌టీ చేయించుకుంటే సంక్షేమ పథకాలు రద్దవుతాయి. కొంతమంది 2014-19 మధ్యలో ఉన్న చెరువు సంఘం అధ్యక్షులు మరోసారి ఎన్నికయ్యారు. వీరికి అప్పట్లో జీఎస్టీ ఉంది. అయినా వీరు అప్పట్లో చేసిన పనులకు బిల్లులు రాకపోవడం, ఆరేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో వాటిని రెన్యూవల్ చేసుకోవాలంటే రూ.లక్షదాకా జరిమానా కట్టాల్సి ఉంటుంది. దీంతో వారు కూడా రెన్యువల్ చేయించుకోవడానికి ముందుకు రావట్లేదు. ముఖ్యంగా జీఎస్‌టీ ఉంటే రేషన్‌కార్డు, తల్లికి వందనం తదితర సంక్షేమ పథకాలు వర్తించవు. అలాంటపుడు పనులు లేకపోయినా పర్వాలేదనీ, ఉన్న సంక్షేమ పథకాలు ఎలా వదులుకోవాలని చెరువు సంఘం అధ్యక్షులు అంటున్నారు. దీనిపై మంత్రి సవిత చెరువు సంఘం అధ్యక్షులతో

(మిగతా 7లో...)

అనంత ఆశలు..!

- వెనుకబడుతున్న 'అనంత' వైద్య కళాశాల
- 51 బోధన సిబ్బంది పోస్టులు ఖాళీ
- రెండు దశాబ్దాలుగా ఇదే తీరు
- నేడు డీఎంఈతో కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం
- అభివృద్ధికి చర్యలు తీసుకునేరా?




వైద్య కళాశాల

అనంతపురం వైద్యం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధి ఒక అడుగు ముందుకు, మూడు అడుగుల వెనక్కి అన్న చందంగా తయారైంది. దేశంలోని ఇతర వైద్య కళాశాలలు అభివృద్ధి బాటలో పయనిస్తుంటే.. అనంతలో మాత్రం ఎప్పుడూ వెనుకబడుతోందని వైద్యవర్గాలు వాపోతున్నాయి. 51మంది బోధన సిబ్బంది లేకపోవడమే ఇందుకు నిదర్శమనీ, రెండు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని పేర్కొంటున్నాయి. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ), రాష్ట్రంలోని డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) సంస్థలపై ఈ మెడికల్ కాలేజీ అభివృద్ధి ఆధారపడి ఉంది. వీటిని సద్వినియోగం చేసుకుంటే మెట్రో నగరాల్లోని కార్పొరేట్ స్థాయిలో అనంత మెడికల్ కాలేజీని అభివృద్ధి చేసుకోవచ్చని వైద్యవర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా బీజేపీ ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ బాధ్యతలు వహిస్తున్నారు. ఆయన దృష్టి సారిస్తే అవసరమైన నిధులు, పోస్టులు తదితరాలు కేంద్రం

(మిగతా 7లో..)

రీసర్వే పాపం..!

- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- తక్కువ భూమి ఉన్నా..
- ఎక్కువగా.. మెట్టను తరి భూమిగా నమోదు..
- పథకాలకు దూరమవుతున్న చిన్న, సన్నకారు రైతులు
- రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ



ROR1b Report

జిల్లా: Anantapur - అనంతపురం	మండలం: SINGANAMALA - శింగనమల	గ్రామం: NIDHANAMADA - నిదనవాడ	Khata No: 456

1	2	3	4 (L.P Number)	5	6 (ULPIN)	7	8	9	10	11 (L.P Extent (Acres-Cents))	12	13	14
1	456	[illegible]	48	87/1	-	[illegible]	-/-	[illegible]	[illegible]	0.2100	[illegible]	XXXX-XXXX-3715 / 99XXXXXXXX	-
2	456	[illegible]	66	87/9	-	[illegible]	-/-	[illegible]	[illegible]	0.2800	[illegible]	XXXX-XXXX-3715 / 99XXXXXXXX	-
3	456	[illegible]	934	23-3??	-	[illegible]	-/-	[illegible]	[illegible]	1.5100	[illegible]	XXXX-XXXX-3715 / 99XXXXXX93	-
4	456	[illegible]	936	103-2B	-	[illegible]	-/-	[illegible]	[illegible]	7.4290	[illegible]	XXXX-XXXX-3715 / 99XXXXXX93	-

రీసర్వే తర్వాత వెబ్‌ల్యాండ్‌లో 9.50 ఎకరాల తరిభూమిగా నమోదు చేసిన దృశ్యం

శింగనమల, జూన్29(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాపం.. పేదలకు శాపంగా మారింది. భూముల రీసర్వే పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. మెట్ట భూమిని తరి భూమిగా నమోదు చేశారు. తక్కువగా భూమి ఉంటే.. ఆన్‌లైన్‌లో ఎక్కువగా ఎక్కించారు. వాటిని చూసి రైతులు షాక్‌కు లోనవుతున్నారు. వెంటనే సరిదిద్దాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. వైసీపీ పాలకులు చేసిన పాపం మూలంగా ప్రస్తుతం ఆయా రైతులు సంక్షేమ పథకాలకు దూరమౌతున్నారు. లేని భూమి అధికంగా, మెట్ట తరిగా చూపుతుండడంతో పథకాలకు అర్హత కోల్పోతున్నారు. ఇష్టారాజ్యంగా రీసర్వే చేసి, తమకు అన్యాయం చేశారని బాధిత రైతులు వాపోతున్నారు. మండలంలోని రాచేపల్లి, నిదనవాడ, జూల్యాకాలువ, పెరవలి, రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే కారణంగా చాలామంది చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పథకానికి మండలంలో చాలా మంది అనర్హులయ్యారు.



ఈయన పేరు నరేష్ రెడ్డి. నిదనవాడ రెవెన్యూ గ్రామ పరిధి సర్వే నంబర్లు 33, 87, 27లో 3.39 ఎకరాల తరి భూమి ఉంది. రీసర్వేలో ఎల్‌పీ నంబర్‌లో 9.50 ఎకరాలు తరి భూమి ఇచ్చారు. తప్పును సరిదిద్దాలని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. భూమి ఎక్కువగా ఉందని 'తల్లికి వందనం' పథకం నరేష్ రెడ్డి పిల్లలకు వర్తించలేదు.

మెట్టను తరిగా చూపారు..



- సుంకన్న, రాచేపల్లి, శింగనమల మండలం

సర్వే నంబరు 180-2లో నాకు 1.09 ఎకరాల మెట్ట భూమి ఉంది. రీసర్వేలో ఎల్‌పీఎం నంబర్ జాయింట్ అకౌంట్‌లో 180-2 సర్వేనంబరులో 9.49 ఎకరాలు తరి భూమి ఉన్నట్లు నమోదు చేశారు. అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా సమస్యను పట్టించుకోలేదు. దీంతో తల్లికి వందనం డబ్బు నా ఇద్దరు బిడ్డలకు జమకాలేదు.

తల్లికి వందనం అందలేదు



- వెంకటమల్లికార్జున, రాచేపల్లి

నాకు సర్వే నంబరు 48లో 3 ఎకరాలు మెట్ట భూమి ఉంది. రీసర్వేలో జాయింట్ అకౌంట్‌లో 9.31 ఎకరాలు తరిభూమిగా అధికారులు భూహక్కు పుస్తకం ఇచ్చారు. అధికారులకు పలుసార్లు వినతిపత్రం ఇచ్చా. రీసర్వేలో పొరబాట్లను సరిదిద్దే ఆప్షన్ రాలేదంటూ కాలం గడిపారు. భూమి అధికంగా ఉంది అంటూ తల్లికి వందనం డబ్బు మా కూమారుడు, కుమార్తెకు జమ కాలేదు.

చలానా కట్టి.. పరిష్కరించుకోవచ్చు..

- నారాయణస్వామి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, శింగనమల

రీసర్వేలో చాలాచోట్ల ఎల్‌పీఎం నంబరు, జాయింట్ అకౌంట్‌తో సమస్యలు తలెత్తాయి. వాటిని సరిదిద్దుకునే ఆప్షన్ ఇప్పుడిచ్చారు. సచివాలయంలో చలానా చెల్లించి, సర్వేయర్‌తో భూమి హద్దులు చూపి నమోదు చేసుకోవచ్చు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు మెసేజ్ వస్తుందన్నారు.

పారదర్శకంగా జరిగేనా..?

- మహిళా పోలీస్ బదిలీల ప్రక్రియ ప్రారంభం
- సీనియారిటీ లిస్ట్.. ఖాళీల జాబితాపై సందిగ్ధం

7

పెళ్లైన ఏడు నెలలకే హత్య..

- అదనపు కట్నం కోసమేనని మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు
- పరారీలో భర్త, కుటుంబ సభ్యులు

ఆర్డీటీని కాపాడుకుంటే జిల్లా సుభిక్షం

- సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ



క్లాక్‌టవర్ కూడలి వద్ద మానవహారం నిర్వహిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు అండదండగా ఉన్న ఆర్డీటీని కాపాడుకుంటే జిల్లా సుభిక్షంగా ఉంచుకోగలమని సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ పేర్కొన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించాలని కోరుతూ ఆదివారం క్లాక్‌టవర్ వద్ద సాహితీవేత్తలు మానవహారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సాహితీవేత్తలు మానవహారంలో పాల్గొని ఆర్డీటీకి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శాంతినారాయణ మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు అనేక ప్రాంతాల్లో ఆర్డీటీ సేవలందించిందని పేర్కొన్నారు. పేదలకు ఇళ్లు, ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ లక్షలాదిమంది పేదల కుటుంబాల్లో ఆర్డీటీ వెలుగులు నింపిందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ఎస్ఎం బాషా, శేషగిరి నాయుడు, వెంకటేశులు, హనుమంతురాయుడు, గోవిందరాజులు, వన్నప్ప, విశ్వనాథరెడ్డి, నారాయణస్వామి, కృష్ణమూర్తి, టీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎగసిన గంగ



యాడికి, జూన్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందన గ్రామంలో ఆదివారం బోరుబావి నుంచి నీరు ఉవ్వెత్తున ఎగిసిపడింది. గ్రామానికి చెందిన రైతు నీటి కోసం బోరు వేస్తుండగా సమీపంలో ఉన్న మరో బోరుబావి నుంచి నీరు ఉవ్వెత్తున ఎగిసిపడింది. బోరుబావి వేస్తున్న సమయంలో ఒత్తిడికి సమీపంలోని మరొక బోరుబావిలో నీరు వచ్చింది. ఈ ప్రాంతంలో ఇలాంటివి సర్వసాధారణమని ఆ ప్రాంత రైతులు తెలిపారు. చందన గ్రామంలో ఒక ప్రాంతంలో అతి తక్కువ విస్తీర్ణంలో సుమారు 80నుంచి 100దాకా బోరుబావులు ఉన్నాయని తెలిపారు. ఇక్కడ ఎప్పుడు బోరువేసినా ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతుంటాయని వారు చెప్పుకొచ్చారు.

ట్రాక్ టెన్షన్..!

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ధ్వంసమౌతున్న ట్రాక్‌లు

- శిథిలావస్థలో 5వ నంబరు ప్లాట్ ఫాం
- తరచూ దెబ్బతింటున్న పట్టాలు
- రైళ్లకు అంతరాయాలు



5వ నంబరు ప్లాట్‌ఫాంలో పట్టా విరగ్గా మరమ్మతులు చేస్తున్న గ్యాంగ్ సిబ్బంది

గుంతకల్లు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో ట్రాక్ కష్టాలు వెంటాడుతున్నాయి. రైలు వస్తోందంటే ప్లాట్‌ఫాం టెన్షన్ పట్టుకుంటోంది. 5వ నంబరు ప్లాట్‌ఫాం శిథిలావస్థకు చేరుకుంటోంది. ప్లాట్‌ఫాంకి వేసిన యాప్రాన్ దెబ్బతింటోంది. దీంతో పక్కనున్న 7వ నంబరు ప్లాట్‌ఫాం ట్రాక్ మాదిరిగానే సమస్యాత్మకంగా మారుతోంది. ఈ రెండు ప్లాట్‌ఫాంలలోని ట్రాక్‌కు సిమెంటు యాప్రాన్‌ను గతంలో నిర్మించారు. తొలుత 7వ నంబరు ప్లాట్‌ఫాంకి వేసిన యాప్రాన్ ధ్వంసమైపోయింది. దీంతో అత్యంత బిజీగా ఉండే ఈ లైన్‌లోకి వెళ్లే రైళ్లను పక్కనున్న 5వ నంబరు ప్లాట్‌ఫాంలోకి పంపేవారు. 7వ నంబరు ప్లాట్‌ఫాంలోని యాప్రాన్ పనికి రాకుండా పోవడంతో ట్రాక్‌లోని స్లీపర్లు వదులైపోయి పట్టాలు విరిగిపోతుండటంతో సమస్యాత్మకంగా మారింది. దీంతో ఆ ప్లాట్‌ఫాంని వినియోగించడం తగ్గించేసి రైళ్లను 5వ నంబరులోకి పంపేవారు. ప్రస్తుతం ఈ ప్లాట్‌ఫాంలోని ట్రాక్ యాప్రాన్ కూడా ధ్వంసమైంది. దీంతో అందులోని సిమెంటు స్లీపర్లు రైళ్లు వచ్చినపుపడల్లా కుంగుతున్నాయి. రైళ్ల బరువుకు పట్టాలు కట్ అయ్యి ప్రమాదానికి అవకాశాలేర్పడుతున్నాయి. కమ్మీలు విరిగినపుడల్లా రైళ్లను ఆపిగానీ, మరో ప్లాట్‌ఫాంపైకి పంపిగానీ గంటల తరబడి మరమ్మతులు చేయాల్సి వస్తోంది.

యాప్రాన్లతో పనిలేదు

ప్లాట్‌ఫాంలపై పారిశుధ్య పనులను సులభతరం చేసేందుకు గతంలో ట్రాక్‌పై సిమెంటు యాప్రాన్ వేసేవారు. ఐదేళ్లుగా పాతతరం కన్వెన్షనల్ కోచ్‌ల స్థానంలో అధునాత ఎల్‌హెచ్‌బీ బోగీలను రీప్లేస్ చేశారు. ఈ బోగీల్లో గ్రీన్ టాయిలెట్లు ఉంటుండటంతో ప్లాట్‌ఫాంల ట్రాక్ వద్ద పారిశుధ్య పనులు చేపట్టాల్సిన పని తగ్గిపోయింది. దీంతో రైల్వే శాఖ నూతనంగా ప్లాట్‌ఫాంలను నిర్మిస్తే యాప్రాన్ వేయడం నిలిపివేసింది. ఈ కారణంగా గుంతకల్లు స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన 1వ నంబరు ప్లాట్‌ఫాంకి యాప్రాన్ వేయలేదు. ఇతర ప్లాట్‌ఫాంలలో గతంలో నిర్మించిన యాప్రాన్లు పాతబడిపోతే వాటిని పూర్తిగా తొలగించి బేలస్టు (కంకర) వేసే పనిని అధికారులు చేపట్టడంలేదు. రైల్వే శాఖ శిథిలమైపోతున్న యాప్రాన్లకు మరమ్మతులు చేస్తూ నెట్టుకొస్తోంది. ఈ కారణంగా గుంతకల్లులోని 2 నుంచి 7 ప్లాట్‌ఫాంలకు వేసిన యాప్రాన్ నిర్మాణాలు ఒక్కొక్కటిగా శిథిలమైపోతూ వస్తున్నాయి. 4వ నంబరు ప్లాట్‌ఫాంకి వేసిన యాప్రాన్ కూడా దెబ్బతింటోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి రైల్వే స్టేషన్‌లో శిథిలమైపోయిన యాప్రాన్లను పునర్నిర్మించడంగానీ, ధ్వంసమైన యాప్రాన్లను తొలగించి బేలస్టు వేయడంగానీ చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా రైల్వే అధికారులు చర్యలు చేపట్టడం లేదు.



ధ్వంసమైన 4వ నంబరు ప్లాట్‌ఫాం యాప్రాన్

కుళ్లాయి స్వామి అగ్నిగుండం ఏర్పాటు

నార్పల, జూన్29(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం ముందు అగ్నిగుండాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున గూగూడు మఖానంలో కుళ్లాయిస్వామి పీర్లను కొలువు తీరుస్తామని ఈఓ శోభ తెలిపారు.



కుళ్లాయిస్వామి అగ్నిగుండం

వెండిహారం..

గూగూడు కుళ్లాయిస్వామికి అనంతపురానికి చెందిన గోపీనాథ్ యాదవ్ 2.5 కేజీల వెండిహారాన్ని సమర్పించారు. ఆలయ ఈఓ శోభ, ప్రధాన అర్చకుడు హుసేనప్పకు అందించారు. హారం విలువ రూ.3లక్షలు అని గోపీనాథ్ యాదవ్ తెలిపారు.



వెండి హారాన్ని ఇస్తున్న పుల్లా గోపీనాథ్ యాదవ్

క్రైం కార్నర్

మంటల్లో కారు


కారులో మంటలు వస్తున్న దృశ్యం

నల్లమాడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి సమీపాన ఆదివారం వెళ్తున్న కారులో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. అందులోని నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని జిల్లా పరిషత్‌లో సీనియర్ ఆడిటర్‌గా పనిచేస్తున్న వెంకటశివారెడ్డి, ఆయన భార్య ఉరకొండ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న అనిత, వారి బంధువు పట్టు పరిశ్రమ శాఖ రిటైర్డ్ అధికారి కేశవరెడ్డి, అతడి భార్య వసుంధర రెడ్డివారిపల్లిలో బంధువుల పెద్దకర్మ కార్యక్రమానికి వచ్చారు. అనంతపురం తిరిగి వెళ్తుండగా రెడ్డిపల్లి, చారుపల్లి సమీపంలోని వంతెన వద్దకు రాగానే కారు నుంచి పొగలు వచ్చాయి. అప్రమత్తమైన కారులోని వారు కిందికి దిగేశారు. మంటలు చెలరేగి, కారు పూర్తిగా కాలిపోయింది. వెంటనే కదిరి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.

పెళ్లైన ఏడు నెలలకే హత్య..

- అదనపు కట్నం కోసమేనని మృతురాలి బంధువుల ఫిర్యాదు
- పరారీలో భర్త, కుటుంబ సభ్యులు


శ్రావణి (ఫైల్)

బుక్కపట్నం, జూన్29(ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఏడు నెలలకే మహిళను హత్య చేశారు. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కమ్మరి శ్రావణి (22)ని భర్త నీలకంఠాచారి ఆదివారం తెల్లవారుజామున హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా పామిడికి చెందిన కమ్మరి రామాచారి కుమార్తె శ్రావణిని కృష్ణాపురం గ్రామానికి చెందిన గోవిందరాజు రెండో కుమారుడు నీలకంఠాచారికిచ్చి గతేడాది నవంబరు 21వ తేదీ వివాహం చేశారు. కట్నకానుకల కింద రూ.మూడు లక్షల నగదు, 15 తులాల బంగారం ఇచ్చారు. తరువాత నీలకంఠాచారి, మామ గోవిందరాజు, మరిది మాణిక్యం కలిసి వరికోత, విస్తరాకుల తయారీ మిషన్ల ఏర్పాటుకు డబ్బులు వెచ్చించారు. ఈ నేపథ్యంలో పుట్టినింటి డబ్బులు తీసుకురావాలని శ్రావణిని వేధించేవారు. కుమార్తె కష్టాలు చూడలేని రామాచారి మూడునెలల క్రితం రూ.లక్ష అల్లుడికి సర్దుబాటు చేశాడు. శనివారం సాయంత్రం శ్రావణి.. తండ్రికి ఫోన్ చేసి, 'మరింత అదనపు కట్నం కావాలని భర్త,మామ, మరిది వేధిస్తున్నారనీ, కొన్నిరోజులు పుట్టినింటికి వస్తాన'ని చెప్పింది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున నీలకంఠాచారి.. మామ రామాచారికి ఫోన్ చేసి శ్రావణి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. తర్వాత తండ్రి, కొడుకులు పరారయ్యారు. శ్రావణి తండ్రి, కుటుంబ సభ్యులు ఉదయాన్నే కృష్ణాపురానికి వచ్చారు. కుమార్తె మృతదేహాన్ని చూసి, బోరున విలపించారు. తన కుమార్తె మరణానికి భర్త, వారి కుటుంబ సభ్యులే కారణమని రామాచారి వాపోయాడు. హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ముగ్గురిపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రావణి మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. వివాహమై ఏడునెలలే కావడంతో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ సురేష్, ఎస్ఐ కృష్ణమూర్తి, ఇన్‌చార్జి తహసీల్దార్ నరసింహులు హత్యాస్థలాన్ని పరిశీలించారు. పరారైన నిందితులకోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

పెళ్లి నాటి నుంచి తమ కుమార్తెను భర్త నీలకంఠాచారి, మామ గోవిందు రాజులు, మరిది మాణిక్యం వేధిస్తున్నట్లు శ్రావణి తల్లిదండ్రులు రామాచారి, పుష్ప కన్నీరుమున్నీరుగా విలపించారు. బిడ్డ బాగుండాలని పలుమార్లు డబ్బులు ఇచ్చామనీ, అయినా శ్రావణిని హత్యచేశారని బోరున విలపించారు.

మణూరులో వృద్ధురాలు..


ముత్తక్క (ఫైల్)

మడకశిర రూరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణూరు గ్రామంలో ముత్తక్క (78)ను హత్య చేశారు. సీఐ నాగేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముత్తక్కకు నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూమార్తె రామలక్ష్మికి అశ్విని అనే కూతురు ఉంది. అమె భర్త చనిపోవడంతో రొద్దం గ్రామానికి చెందిన రహీమ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. శనివారం ముత్తక్కను చూడడానికి అశ్విని, రహీమ్ మణూరుకు వెళ్లారు. ముత్తక్కతో గొడవపడ్డారు. ఆదివారం ఉదయం ముత్తక్క ఇంట్లో అచేతనంగా పడి ఉండడంతో స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు కనిపించడంలేదనీ, అశ్విని, రహీమ్ దాని కోసం హత్యచేసి ఉంటారని ముత్తక్క కుమారుడు నరసింహమూర్తి అనుమానం వ్యక్తం చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏకపక్షంగా..

- ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలపై విమర్శలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలు ఏకపక్షంగా నిర్వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీల్లో శనివారం గందరగోళానికి దారితీయడంతో తిరిగి ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మళ్లీ కొత్త సమస్యలు తలెత్తాయి. ర్యాంకుల వారీగా పూర్తి చేద్దామంటే.. మరో పక్క సిఫార్సు లేఖలు అడ్డొచ్చాయి. అన్ని అర్హతలు, సిఫార్సు లేఖలు ఉన్న కొందరికి కోరుకున్న స్థానాలు దక్కాయి. మరికొన్ని చోట్ల ప్రతిభ ఉన్నా సిఫార్సులకే మొగ్గు చూపారన్న చర్చ జరుగుతోంది. శనివారం స్పౌజ్ కేటగిరీలో ముగ్గురు అనర్హులుగా తేలడంతో రద్దు చేశారు. ఇందులో ఇతర జిల్లాలో పని చేసేవారు ఇక్కడ స్పౌజ్ వర్తించదని తిరస్కరించారు. కౌన్సెలింగ్‌లో ప్రతిభ కలిగిన వారిలో మంచి ర్యాంకు వచ్చిన వారు ఎక్కువ మంది సత్యసాయి జిల్లా నుంచి అనంతపురం పరిసర ప్రాంతాలకు మొగ్గు చూపడంతో సమస్య ఉత్పన్నమయింది. బదిలీల ప్రక్రియలో ఎస్ఈ జహీర్ అస్లాంతో పాటు ఈఈ ప్రభాకర్‌రెడ్డి, సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మనుషులంతా సోదరభావంతో మెలగాలి

- ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి


ఆయుధం లాంటి మనిషి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అనంతపురం టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సమాజంలోని మనుషులంతా తోటివారిపట్ల సోదర భావంతో మెలగాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కవి లోసారి సుధాకర్ రచించిన 'ఆయుధం లాంటి మనిషి' కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాచపాళెం మాట్లాడుతూ... మనిషికి సామాజిక స్పృహతోపాటు కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా తోటివారితో ఆత్మీయత కలిగి ఉండాలన్నారు. ఇలాంటి భావాలకు ప్రతిబింబమే ఆయుధం లాంటి మనిషి పుస్తకం అని పేర్కొన్నారు. కవి సుధాకర్ మానవ బంధాలు, ప్రజా సమస్యలను తన కలంతో అక్షరరూపం ఇచ్చారన్నారు. ఇందులో స్త్రీల సమస్యలను సైతం వ్యక్తపరచడం కవి ఆలోచనా శైలికి అద్దం పడుతోందన్నారు. కార్యక్రమంలో కెంగార మోహన్, డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల సందడి..!

- ఉద్యాన, పశుసంవర్ధక శాఖల్లో కౌన్సెలింగ్
- ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్దపీట


ఉద్యాన సహాయకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆ శాఖ డీడీ ఉమాదేవి, కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ఉద్యాన, పశుసంవర్ధక శాఖల్లో సిబ్బంది బదిలీల కౌన్సెలింగ్‌తో ఆయా కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. ఆదివారం ఉదయం 11.30 గంటలకు ఉద్యాన శాఖ డీడీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఉద్యాన సహాయకుల బదిలీల కౌన్సెలింగ్ మొదలై రాత్రి దాకా కొనసాగింది. ఉమ్మడి జిల్లాలో ఐదేళ్లు పూర్తయిన 280 మంది ఉద్యాన సహాయకులతోపాటు రిక్వెస్ట్ కింద బదిలీ కోసం 43 మంది దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ సీనియార్టీ మేరకు ఒక్కొక్కరిగా కౌన్సెలింగ్ హాల్‌లోకి సిబ్బందిని పిలిచి, ఆప్షన్లు రాసుకున్నారు. అనంత ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి, సత్యసాయి జిల్లా డీడీ చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఉద్యాన ఏడీ దేవానంద్, ఇతర కమిటీ సభ్యులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉద్యాన శాఖ బదిలీల్లో ఎక్కువ శాతం ప్రజాప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పశుసంవర్ధక శాఖలో కౌన్సెలింగ్ పూర్తి

అనంతపురం పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పశుసంవర్ధక సహాయకుల బదిలీల కౌన్సెలింగ్ ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో 27 మంది ఐదేళ్లు పూర్తయిన సిబ్బందితో మూడు ఆప్షన్లు తీసుకున్నారు. రిక్వెస్ట్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న 99 మందికి మండలం ఆప్షన్ తీసుకున్నారు. కోరుకున్న మండలంలో ఏ స్థానానికైనా బదిలీ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. క్రమబద్ధీకరణలో స్థానాలు కోల్పోయిన మరో 37 మందికి ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు నిబంధనల మేరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి పేర్కొన్నారు.

అనంత ఆశలు

(5వ పేజీ తరువాయి)

నుంచి సులువుగా రాబట్టవచ్చని వివరిస్తున్నాయి. విజయవాడలో సోమవారం డీఎంఈతో నిర్వహించనున్న సమావేశంలో అనంత మెడికల్ కాలేజీ అభివృద్ధి అంశాన్ని ప్రస్తావించే అవకాశాలున్నాయని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రధాన విభాగాలకు అధిపతుల్లేరు..

ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రధాన విభాగాలకు అధిపతులు లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. సైక్రియాట్రీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, రేడియోడయాగ్నోసిస్, డెంటిస్ట్రీ, కార్డియాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, కార్డియాలజీ క్యాథ్‌ల్యాబ్ అండ్ సీటీవీఎస్, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాలకు హెచ్‌ఓడీలు లేకపోవడం ఏంటని వైద్యవిద్యవర్గాలు విమర్శిస్తున్నాయి. ఫోరెన్సిక్, రేడియో డయాగ్నోసిస్ విభాగాలకు ఇద్దరు చొప్పున. డెంటిస్ట్రీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, ఎండోక్రొనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాలకు ఒకరు చొప్పున అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

27 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు..

ప్రొఫెసర్లకు, అసోసియేట్ ప్రొఫెసర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కుడి, ఎడమ భుజంలాంటివారు. అలాంటి ప్రాముఖ్యతగల పోస్టులు 27 ఖాళీగా ఉన్నాయి. అనాటమీలో నలుగురు, ఫిజియాలజీలో ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. రేడియోడయాగ్నోసిస్, ఎండోక్రొనాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, నెఫ్రాలజీ, కార్డియాక్ ఐసీసీయూ విభాగాల్లో ఇద్దరు చొప్పున కొరత ఉన్నారు. బయోకెమిస్ట్రీ, మైక్రోబయోలజీ, జనరల్ సర్జరీ, అనస్థీసియాలజీ, డెంటిస్ట్రీ, పీడియాట్రిక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, కార్డియాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో ఒకటి చొప్పున మొత్తం 27 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోసులు ఖాళీగా ఉన్నాయి. మెడికల్ కళాశాలలోని విభాగాల్లో టీచింగ్ ఫ్యాకల్టీ ఖాళీలున్నంత వరకు వైద్యసేవల అభివృద్ధిలో వెనుకబాటులో ఉన్నట్లేనని వైద్యవిద్యరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

- ప్రొఫెసర్ షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్



కళాశాల అభివృద్ధికి ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తా. కళాశాలకు ముఖ్యమైన టీచింగ్ ఫ్యాకల్టీ తగిన సంఖ్యలో లేరు. ఎన్ఎంసీ నిబంధనల మేరకు అవసరమైన ఫ్యాకల్టీని నియమించాలని ఇప్పటికే డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. మిగిలిన విభాగాల్లో వసతుల అభివృద్ధిపైనా వివరాలు పంపాం. కళాశాల అభివృద్ధికి అవసరమైన అంశాలను ఉన్నతాధికారులకు వివరించేందుకు కృషిచేస్తా.

అయినవారికి ఆకుల్లో..

- బదిలీల్లో డీపీఓ సిబ్బంది ఇష్టారాజ్యం..
- ప్రతిభావంతులకు అన్యాయం

అనంతపురం న్యూటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలకు సంబంధించి గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల్లో అయినవారికి ఆకుల్లో.. లేదంటే జిల్లా సరిహద్దుల్లో అన్న విధంగా చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఆదివారం కౌన్సెలింగ్ ప్రారంభించే లోపే సిఫార్సులకు, అయిన వారికి సంబంధించి కోరుకున్న ప్లేస్‌లను బ్లాక్ చేసి ర్యాంకుల వారీగా పిలిచారు. ప్రతిభ ఉన్న ర్యాంకర్లకు మొండిచేయి చూపారన్న విమర్శలు వినిపించాయి. డీపీఓ సిబ్బంది నిర్వహించిన బదిలీల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిభ ఉన్నవారికి మొండిచేయి తప్పలేదన్న చర్చ జరిగింది. ఆర్డర్ ఫారాలు చేతికి వస్తే తప్ప.. అక్కడ జరిగిన లోపాలు వెలుగులోకి వచ్చే అవకాశం లేదు. అర్డర్ ఫామ్స్ చేతికి వచ్చే సరికి ఒక్కొక్కటిగా సిబ్బంది తప్పిదాలు బయట పడే అవకాశం ఉంది. ఈ బదిలీల ప్రక్రియలో డీఎల్‌పీఓలు విజయ్‌కుమార్, శివకుమారి, ఏఓలు పాల్గొన్నారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించాలి

- సచివాలయ సర్వేయర్ల డిమాండ్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సర్వే శాఖ పరిధిలోని సచివాలయ సర్వేయర్ల బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. నిబంధనల మేరకు ర్యాంకుల వారిగా కేటాయించాలంటూ సర్వేయర్లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఉదయం 9గంటలకు అధికారులు కౌన్సెలింగ్ ఆరంభించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో ఐదేళ్లు పూర్తయిన వారు 665, స్పౌజ్ ఇతర కారణాలతో 450మంది మొత్తం 1115మందికి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. కౌన్సెలింగ్ సమయంలో అధికారులు నిర్వహించే తీరుపై ఉద్యోగులు విముఖత వ్యక్తం చేశారు. ర్యాంక్‌ల ప్రకారం ఇవ్వకుండా ఎలా కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఏయే ఖాళీలు ఉన్నాయి..?ఎవరెవరు ఖాళీ చేశారు..?ఆ స్థానంలో ఎవరిని నియమిస్తున్నారనే విషయంలో స్పష్టత చూపడం లేదన్నారు. దీంతో కౌన్సెలింగ్ ఆలస్యమైంది. ఈ విషయం ఉద్యోగుల యూనియన్ నాయకులు అరుణ్, రవికుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఉన్నతాధికారులను కలి శారు. అనంతరం రాత్రి 10గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

నేడు జాబ్‌మేళా

ఉరవకొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మా డిగ్రీ కళాశాలలో సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బసవరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 10కి పైగా మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయని అన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్న వారు పాల్గొనవచ్చునని తెలిపారు.

నేటి నుంచి ఏఎన్ఎంల బదిలీలు

అనంతపురం వైద్యం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు సోమవారం నుంచి బదిలీలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 803 మంది ఏఎన్ఎంలు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్నారు. వీరిలో 740 మంది ఐదేళ్లు పూర్తయిన వారున్నారు. డిస్ట్రిక్ట్ సెలెక్షన్(డీఎస్సీ)లో వచ్చిన ర్యాంకు ఆధారంగా మెరిట్ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. స్పౌజ్, పీహెచ్‌సీ వెసులుబాటు కల్పించామన్నారు. జూమ్ మీటింగ్ ద్వారా ఎక్కడికక్కడే విధుల్లో నుంచే ఏఎన్ఎంలు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి ఆధ్వర్యంలో ప్రక్రియ చేపట్టనున్నారు.

వెల్లువలా దరఖాస్తులు

అనంతపురం వైద్యం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఆశా కార్యకర్తల ఖాళీల భర్తీకి దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని మొత్తం 58 పోస్టులకు సోమవారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని అధికారులు తెలిపారు. ఖాళీస్థానాల పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో అధికారులు, సచివాలయాల్లో అయితే ఏఎన్ఎంలు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

యాడికి, జూన్29(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల బాలికపై 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఆడుకుంటున్న బాలికపై 55 ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. గమనించిన స్థానికులు అతడిని మందలించారు. బాలిక ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. బాలిక తండ్రి సదరు వ్యక్తిని మందలించడంతో ఆ వ్యక్తి బంధువులు బాలిక తల్లిదండ్రులపైన దాడికి యత్నించారు. బాలికతో కలిపి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. అత్యాచారయత్నానికి ఒడిగట్టిన వ్యక్తి గతంలో కూడా ఓ బాలికపై అఘాయిత్యానికి పాల్పడినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

భార్యను తిట్టాడని హత్య

- మద్యం మత్తులో గొడవ పడి దారుణం
- ఇద్దరు నిందితుల అరెస్ట్: డీఎస్పీ

అనంతపురం క్రైం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): భార్యను కామెంట్ చేశాడని, బూతులు తిట్టాడని ఆమె భర్త మరో వ్యక్తికి ఏకంగా హత్య చేశాడు. మద్యం మత్తులో నాలుక జారినందుకు ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. అనంతపురం నగరంలోని బళ్లారి బైపాస్ సర్కిల్‌లో జరిగిన ఈ హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జగదీష్, ఎస్ఐలు ప్రసాద్, విజయప్రసాద్‌తో కలసి ఆదివారం 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన గూడూరు సిదానంద ఈ నెల 23న రాత్రి హత్యకు గురయ్యాడు. చిన్న కిరాణా దుకాణంలో పనిచేసే ఇతడు బళ్లారి బైపాస్ సర్కిల్‌లో నేషనల్ హైవే వంతెన కింద అన్న క్యాంటీన్ వద్ద ఉన్న పార్కులో నిద్రిస్తుండగా దుండగులు ఫుట్‌పాత్‌కు వేసే సిమెంట్ ఇటుకతో తలపై మోది హత్య చేశారు. దీనిపై 4వ పట్టణ సీఐ జగదీష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. సంఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ప్రత్యేక టీంను వేశారు. స్థానికంగా లభించిన సీసీ ఫూటేజ్‌తోపాటు క్లూస్ టీమ్స్ సహాయంతో ముమ్మరంగా గాలించారు. ఎట్టకేలకు ఆదివారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించడంతో హత్య వెనుక అసలు విషయం బయటపెట్టారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మద్యం మత్తులో గొడవతో మొదలు..

నగరంలోని ఐదో రోడ్డులో నివాసం ఉంటున్న లక్ష్మన్న(25), విద్యారణ్యనగర్‌కు చెందిన తుమ్మశెట్టి వెంకటరెడ్డి(30)కు నెల కిందట పరిచయమైంది. ఇద్దరూ బొప్పాయి, దోసకాయ పండ్ల లోడింగ్ పనులకు వెళుతుంటారు. ఇద్దరూ మద్యానికి బానిసలే. 23న రాత్రి బళ్లారి బైపాస్‌లో మద్యం తాగుతుండగా యాధృచ్చికంగా సిదానందతో చిన్నపాటి గొడవ జరిగింది. మాటా మాటా పెరిగి తిట్టుకున్నారు. మద్యంమత్తులో సిదానంద లక్ష్మన్న భార్యను బూతులు తిట్టాడు. దీంతో ఆయన కోపోద్రిక్తుడయ్యాడు. తన ఫ్రెండ్ వెంకటరెడ్డితో మాట్లాడి ఎలాగైనా చంపాలనుకున్నాడు. సిదానంద కోసం వెతికాడు. మద్యం తాగిన తర్వాత క్యాంటీన్ పక్కన పార్కులో నిద్రిస్తున్నట్టుగా గుర్తించారు. విచక్షణ మరిచి ఫుట్‌పాత్ సిమెంట్ ఇటుక తీసుకొని ఇద్దరూ ఐదుసార్లు కొట్టి చంపేశారు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తిరుపతికి పారిపోయారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులు లక్ష్మన్న, వెంకటరెడ్డిని ఆదివారం ఉదయం నడిమివంక వద్ద అరెస్టుచేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

పనులా.. పథకాలా..?

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీఎస్టీ లేకుండా పనులు అప్పగించేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

జీఎస్టీ చేయించుకుంటే పథకాలు పోతాయంట

- శంకరప్ప, చెరువు సంఘం అధ్యక్షుడు, బూచర్ల, రొద్దం మండలం



చెరువు పనులు చేయాలని అధికారులు చెబుతున్నారు. జీఎస్టీ ఉంటేనే మా ఖాతాకు నిధులు వస్తాయి. లేదంటే డబ్బులు రావంటున్నారు. జీఎస్టీ చేయించుకుంటే సంక్షేమ పథకాలు రావు. ప్రభుత్వం మరోసారి ఆలోచించి జీఎస్టీ లేకుండా పనులు అప్పగించాలి.

నిధులు వెనక్కిపోయే ప్రమాదం

లక్ష్మయ్య, చెరువు సంఘం అధ్యక్షుడు, పూలకుంట, హిందూపురం మండలం



చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జీఎస్టీ మెలికపెట్టడంవల్ల పనులు చేసినా మాపేరు మీద డబ్బులురావు. జీఎస్టీ తప్పనిసరి చేశారు. జీఎస్టీ లేకపోతే పనులు త్వరితగతిన పూర్తి చేయవచ్చు. పనులు చేయకపోతే నిధులు వెనక్కిపోయే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- గురుమూర్తి, ఈఈ, మైనర్ ఇరిగేషన్, పెనుకొండ

జిల్లాల్లో 120చెరువుల మరమ్మతులకు రూ.2 కోట్లకుపైగా నిధులు మంజూరయ్యాయి. చెరువు సంఘం అధ్యక్షులకు జీఎస్టీ లేదు. జీఎస్టీ ఉంటేనే వారిపేరుమీద పనులు చేస్తే డబ్బులు జమవుతాయి. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని తెలియజేశాం. గ్రామ పంచాయతీల తరహాలో రూ.10లక్షల లోపు పనులకు జీఎస్టీ లేకుండా నామినేషన్ పద్ధతిలో అప్పగిస్తే బాగుంటుంది.

ఎమ్మెల్యే లెటర్ లేదా...?

(5వ పేజీ తరువాయి...)

వారిపై వేదికమీద ఉన్న డీడీ రుబాబు ప్రదర్శించడం చూసి అందరూ అవాక్కయ్యారు.

సిఫార్సుల ముసుగులో అధికారుల బిజినెస్..?

ఇలాంటి సమయంలో అధికారపార్టీ నేతలు సిఫార్సు లేఖలు ఇవ్వడం సహజం. సీనియార్టీ జాబితాలో ముందు వరుసలో ఉన్న వారికి అన్యాయం జరగకుండా నేతల లేఖలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ డీడీ ఉమ్మడి జిల్లాలో 600 మందికి పైగా వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలు ఉంటే.. దాదాపు 60 శాతం మందికి సిఫార్సుల పేరుతో అర్హులకు అన్యాయం చేయడం ఆశ్చర్యం కలిగించింది. మరోవైపు సిఫార్సుల ముసుగులో సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారులు, సిబ్బంది సైతం బిజినెస్ నడిపి జేబులు నింపుకున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కొందరు కార్యాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్లతో కుమ్మక్కై రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఒప్పందం చేసుకొని కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం: యూటీఎఫ్

అనంతపురం విద్య, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను కాపాడుకోవడం ఉపాధ్యాయులుగా మన బాధ్యత అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన విద్యా సంవత్సరం మొదలైందని, పిల్లందరినీ బడిలో చేర్పించుకొని ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకుందామన్నారు. సమస్యలపై పోరాటాలు సాగిస్తూనే.. విద్యార్థులకు విద్య నేర్పించడంలో ప్రతి టీచర్ చిత్తశుద్ధి ప్రదర్శించాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు రమణయ్య, అబ్దుల్‌ఖాన్, శేఖర్, రాముడు, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, దేవేంద్రమ్మ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా జరిగేనా..?

- మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ ప్రారంభం
- సీనియారిటీ లిస్ట్.. ఖాళీల జాబితాపై సందిగ్ధం
- ప్రిఫరెన్షియల్, స్పౌజ్ సర్టిఫికెట్ల పరిశీలన
- నేడు కౌన్సెలింగ్


సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం క్రైం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసులకు నిర్వహించనున్న బదిలీల ప్రక్రియ పాదర్శకతపై సందేహాలు కలుగుతున్నాయి. బదిలీల కౌన్సెలింగ్‌కు ముందుగానే ఉద్యోగుల సీనియారిటీ జాబితా ప్రకటించాల్సి ఉంది. అదేవిధంగా కంపల్సరీ, రిక్వెస్టు బదిలీల ఖాళీలు చూపించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఎలాంటి లిస్టు ప్రదర్శించలేదు. దీంతో వందలాది మంది మహిళా పోలీసుల్లో ఆందోళన నెలకొంది. సీనియారిటీ, ఖాళీల జాబితాలు బయటకు ఇవ్వకపోవడంతో ఆయా వర్గాల్లో హైటెన్షన్ నెలకొంది. పోలీస్ వర్గాల సమాచారం మేరకు... అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో గ్రామ, వార్డు సచివాలయాలకు 1207 మహిళా పోలీస్ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో 1064 పోస్టుల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే మహిళా పోలీసులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదుచేశారు. ఒకే సచివాలయంలో ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న వాళ్లు తప్పనిసరిగా, ఐదేళ్లు పూర్తి కాని వారు రిక్వెస్టు బదిలీ కింద హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ తర్వాత ఖాళీల వివరాలు, సీనియారిటీ జాబితాలు ప్రదర్శించాలి. జిల్లా పోలీసు అధికారులు ఆదివారం సాయంత్రం వరకూ ఆ లిస్టులను బహిర్గతం చేయలేదు. పీహెచ్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉద్యోగులతోపాటు, స్పౌజ్ పెట్టుకున్న ఉద్యోగులను పిలిపించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు ఆదివారం ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు, స్పౌజ్, నో డ్యూ సర్టిఫికెట్లు పరిశీలించారు. వీరికి సోమవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

భారీగా పైరవీ లెటర్లు...?

ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో పలువురు మహిళా పోలీసులు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు ఇచ్చినట్టు సమాచారం. తమకు ఫలానా స్థానాలు కావాలంటూ.. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతర ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లెటర్లు ఇచ్చినట్టు తెలుస్తోంది. బదిలీల్లో పోలీస్ ఉన్నతాధికారులు సిఫార్సులకు పెద్దపీట వేస్తారా..? లేక పారదర్శకంగా చేస్తారా చూడాలి.

సజ్జలా.. నీకు అంత దమ్ముందా..!

● ఆరుమాసాల్లో నువ్వు, మీ జగన్ లోపలికే..
● టీడీపీ రాష్ట్ర నాయకుడు చంద్రదండు ప్రకాష్‌నాయుడు ఫైర్


మాట్లాడుతున్న చంద్రదండు ప్రకాష్‌నాయుడు

అనంతపురం క్రైం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో టీడీపీ వాళ్లను జైళ్లలో వేస్తామని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అంటున్నారని, నిజంగా సజ్జల నీకు అంత దమ్ముందా అంటూ ఏపీ మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకుడు చంద్రదండు ప్రకాష్ నాయుడు ఫైర్ అయ్యారు. నగరంలోని చంద్రదండు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , మంత్రి లోకేష్ సారథ్యంలో లిక్కర్ కుంభకోణం తేల్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, దీంతో వైసీపీ వాళ్లు విదేశాలకు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. లిక్కర్ స్కాం, ఇతర అవినీతి కేసుల్లో కూరుకుపోతున్న సజ్జల, వాళ్ల నాయకుడు జగన్ ఆరు మాసాల్లో లోపలికి వెళ్లడం ఖాయమని అన్నారు. టీడీపీ నాయకులను జైల్లో పెట్టడం జగన్‌కు, వాళ్ల నాన్న వైఎస్ఆర్‌కు, వాళ్ల తాత రాజారెడ్డి చేత కూడా కాలేదంటూ చురకలంటించారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డికి జేసీ దివాకర్‌రెడ్డి రాజకీయాలు నేర్పారని, ఇప్పుడు ఆ జేసీ కుటుంబంపైనే అనంత విమర్శలు చేస్తుండడం సిగ్గుచేటుగా ఉందని అన్నారు. ప్రజల కోసం పోరాడిన నాయకుడు పరిటాల రవీంద్ర అని, ఆయనపైనా విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ఈస్టాంపుల కుంభకోణం నిందితుడు మీసేవ బాబు వైసీపీ మాజీ ఎంపీ రంగయ్య మనిషేనన్నారు. ఎస్సార్సీ ద్వారా 20 వేల నుంచి 30 వేల మందికి ఉపాధి ఇస్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుపై విమర్శలు చేయడం రంగయ్యకు తగదన్నారు. సొంత కార్యకర్తలను సరిగ్గా చూసుకోలేని స్థితిలో వైసీపీ ఉందన్నారు. ప్రగల్భాలు పలకడం సరికాదని, ఇప్పటికైనా అలాంటి మాటలు మానాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ నాయుడమ్మ, నరేష్ యాదవ్, మంగళ సుధాకర్, రవి, ప్రవీణ్ చౌదరి, సాయియాదవ్, యుగంధర్, మంగళ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తున్నారు: మేయర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల, ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాస్తోందని నగర మేయర్ మహమ్మద్ వసీం విమర్శించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూలై 3,4వ తేదీల్లో హర్యానాలోని గురుగ్రామ్‌లో రాజ్యాంగ ప్రజాస్వామ్యం, జాతి నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై రెండ్రోజుల పాటు జాతీయ సదస్సు జరగనుందన్నారు. ఇందుకు మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్లను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి, కేవలం ప్రభుత్వానికి చెందిన వారికి మాత్రమే ఆహ్వానం ఇవ్వడం దారుణమన్నారు. ప్రతిపక్షపార్టీ ప్రజాప్రతినిధులను గౌరవించడం తెలియదా అని ప్రశ్నించారు.

ధర్నాను విజయవంతం చేయండి: ఈయూ

అనంతపురం టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ జూలై 4, 5వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ధర్నా చేపట్టనున్నామని, విజయవంతం చేయాలని చేయాలని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సమస్యలను ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్నారని, వాటన్నింటి పరిష్కారం కోరుతూ ధర్నా చేపట్టనున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈయూ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీ భాస్కర్‌రెడ్డి, కోశాధికారి రామకృష్ణ, నాయకులు కొండయ్య, మల్లికార్జున, విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయి భిక్షాటన


భిక్షాటన చేస్తున్న సాయి భక్తులు

అనంతపురం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మూడవరోడ్డు షిర్డీ సాయి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో సాయి భిక్షాటన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి భిక్షాటన చేశారు. ఇందులో సేకరించిన నిత్యావసర సరుకులను గురుపౌర్ణమి నాడు భక్తులకోసం అన్నదానానికి వినియోగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా గణాంక దినోత్సవాలు

అనంతపురం కలెక్టరేట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీఓ) కార్యాలయంలో 19వ గణాంక దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భారత గణాంకాల పితామహుడు, 1వ ప్రణాళికా సంఘం సభ్యుడు, భారత గణాంక సంస్థ వ్యవస్థాపకుడు పీసీ మహల్నోబిస్ జయంతిని పురస్కరించుకుని గణాంక దినోత్సవ వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఓ అశోక్‌కుమార్, ఎస్ఓ మనోహర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

అనంతపురం విద్య, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ,ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్‌సీని ప్రకటించి న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. నగరంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీఆర్‌సీ ఇప్పటికే ఆలస్యమైందన్నారు. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయులు,పెన్షనర్లకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రాజశేఖర్, కిషోర్ మల్లికార్జున, రామకృష్ణ, నరసింహ, రామాంజనేయులుపాల్గొన్నారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా శంషాద్ బేగం

అనంతపురం వైద్యం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శంషాద్‌బేగం నియమితులయ్యారు. విజయవాడలో సోమవారం జగరనున్న డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) సమావేశానికి ప్రిన్సిపాల్ షారోన్ సోనియ ఆదివారం వెళ్లారు. సమావేశం అనంతరం ఆమె మంగళవారం విధుల్లోకి రానున్నారు. దీంతో సోమవారం ఒకరోజు ప్రొఫెసర్ శంషద్‌బేగం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించనున్నట్లు ప్రిన్సిపాల్ షారోన్ సోనియ పేర్కొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ఎస్‌యూసీఐ లక్ష్యం

అనంతపురం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే ఎస్‌యూసీఐ లక్ష్యమని ఎస్‌యూసీఐ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ అమర్నాథ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ట్రూఅప్ చార్జీల పేరుతో గత వైసీపీ ప్రభుత్వ విధానాన్ని కొనసాగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం ప్రజల మీద భారం మోపుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంతోపాటు విద్యుత్ చార్జీల పెంపుదల, స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలన్నారు. ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర మాట్లాడుతూ... జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌యూసీఐ జిల్లా కమిటీ సభ్యుడు తబ్రేజ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యం, నాగముత్యాలు, మహేష్, నగర కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్


శింగనమల, రాప్తాడు ఎమ్మెల్యేలు బండారుశ్రావణిశ్రీ, పరిటాల సునీత


మంత్రి లోకేశ్‌తో జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు

ఏడాదిలోనే సుపరిపాలన అందించాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం క్రైం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రజలకు సుపరిపాలన అందించామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విస్తృతస్థాయి సమావేశం, తొలి అడుగు ఇంటింటి కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసితో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ... జూలై 2 నుంచి చేపడుతున్న ఇంటింటికీ ప్రచార కార్యక్రమంపై సీఎం చంద్రబాబు ఇచ్చిన సందేహం ఆకట్టుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందని, పలు సంక్షేమ పథకాలు అమలు చేసిందని తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి, అందిస్తున్న పథకాలపై ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వైసీపీ నేతలు ఎంత బురద చల్లినా.. ఏడాదిలో సుపరిపాలన అందించారన్న సంతృప్తి ప్రజల్లో ఉందన్నారు. ఇప్పటికే ఎన్నో పథకాలు అమలు చేసి ప్రజలకు దగ్గరయ్యామన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలు అమలుకాబోతున్నాయన్నారు. జూలై 2 నుంచి ప్రతి కార్యకర్త, నాయకుడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న పథకాలు గురించి వివరించాలని సూచించారు. రాబోయే నాలుగేళ్లలో అనంతపురం అర్బన్ నియోజవకర్గంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పాల్గొన్నారు.

'తొలి అడుగు'లో జిల్లా ప్రజాప్రతినిధులు..

విజయవాడలోని సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన తొలి అడుగు సమావేశంలో పలువురు జిల్లా ప్రజాప్రతినిధులు,టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నాయకుడు రామలింగారెడ్డి, అనంతపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళి, రాష్ట్ర కార్యదర్శులు రాయల్ మురళి, గడ్డం సుబ్రమణ్యం, తలారి ఆదినారాయణ, నటేష్ చౌదరి, ఇతర నేతలు దేవళ్ల మురళి, నరసింహ మూర్తి, శింగనమల నేత పర్వీన్ తాజ్ తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: విజయవాడలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. అనంతరం ఆమె నియోజకవర్గంలో తొలిఅడుగు ఇంటింటి కార్యక్రమం చేపట్టి విజయవంతం చేయడంపై అక్కడే ఉన్న నియోజకవర్గ ముఖ్య నాయకులతో చర్చించారు.

మాజీ ఉద్యోగి అనుమానాస్పద మృతి

అనంతపురం క్రైం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలోని అరవింద్ నగర్‌లో అపార్టుమెంట్ నుంచి దూకి ఓ మాజీ ఉద్యోగి ఆదివారం అనుమానాస్పద మృతి చెందాడు. సాయి కొరల్ కౌంటీ అపార్టుమెంట్‌లోని 5వ ఫ్లోర్ నుంచి సాయంత్రం 6:30 గంటల సమయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. సుంకర మునిశేఖర్(50) సొంతూరు కడప. సాంఘిక సంక్షేమ శాఖలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ 2017లో వదిలేశారు. ఆయన భార్య లక్ష్మితో 2015లో మనస్పర్థలతో విడిపోయినట్టు తెలుస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా... తల్లితోనే ఉంటున్నట్టు సమాచారం. ఉద్యోగం వదిలేసిన తర్వాత ఆయన అశోక్‌నగర్‌లోని ఓ ఇంటికి అద్దెకు తీసుకుని ఉన్నట్టు తెలిసింది. సాయంత్రం సాయి కొరల్ కౌంటీ అపార్టుమెంట్‌లో ఉన్న తన ఫ్రెండ్ జయప్రకాష్‌ను కలిసేందుకు రాగా...ఆయన ఊరికి వెళ్తాను తర్వాత కలుద్దాం అని చెప్పి వెళ్లారని సమాచారం. వెనక్కు వెళ్లకుండా 5వ ఫ్లోర్‌కు వెళ్లి... కళ్లజోడు, చెప్పులు వదిలేసి దూకినట్టు తెలుస్తోంది. కిందపడ్డప్పుడు తలకు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంటనే టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రిటైర్డ్ డీఏఓ మునీంద్రకు ఘన సన్మానం


మునీంద్ర దంపతులను సన్మానిస్తున్న ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) ఆర్‌డబ్ల్యూఎస్ డీఏఓ మునీంద్రకు రిటైర్డ్ అయినందుకు గాను జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆ విభాగం ఎస్ఈ సురేష్, ఈఈ మురళీధర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై మునీంద్ర దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. మునీంద్ర ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో 40 ఏళ్ల పాటు విశేష సేవలందించారని కొనియాడారు. శేష జీవితం ప్రశాంతంగా మంచి ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ విభాగానికి సంబంధించి పలువురు డీఈలు, ఏఈలు, సిబ్బందితో పాటు కుటుంబ సభ్యులు యాగవాణి, సౌజన్య, సురేంద్రనాథ్, సంతోష్‌కుమార్‌గౌడ్, మంజుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బాబు సేవలు ఎనలేనివి


బాబును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు తదితరులు

అనంతపురం విద్య, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఉపాధ్యాయుడు బాబు సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. బుక్కరాయసముద్రం జడ్పీ ఉన్నతపాఠశాలలో పని చేస్తున్న ఆయన రిటైర్డ్ అయ్యారు. ఇందుకు గాను అనంతపురంలోని కల్యాణదుర్గం రోడ్డులోని ఓపంక్షన్‌హాల్‌లో ఆదివారం సన్మానం జరిగింది. ఇందులో టీడీపీ నాయకులు మాల్యవంతం విజయకుమార్, ఆలుమూరి సూరి, రాజారావ్, ఎస్కేయూ రిజిస్ట్రార్ వెంకటనాయుడు, ఉపాధ్యాయసంఘాలనేతలు కోనంకి అశోక్‌కుమార్, నరసింహులు, సిరాజుద్దీన్, కులశేఖరరెడ్డి, రమణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామలింగయ్య, వెంకటరత్నం, మరళీమోహన్, రామగిరిక్రిష్టప్ప, తులసిరెడ్డి,శ్రీనివాసనాయక్, బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై బాబుకు పూలమాలలు, శాలువాలతో ఘన సన్మానం చేశారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ టీచర్‌వృత్తిలో బాబు చేసిన సేవలను కొనియాడారు.

'అధిక వడ్డీ బాధితులకు అండగా ఉంటాం'

అనంతపురం టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ బాధితులకు అండగా ఉంటామని ఓసీ సంఘర్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సింగం సదాశివరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం 'అధిక వడ్డీలు-ఆత్మహత్యలు' అనే అంశంపై నిర్వహించిన చర్చావేదికలో ఆయన మాట్లాడారు. పేదరికం కారణంగానే చాలామంది అధిక వడ్డీలకు సైతం అప్పులు చేస్తున్నారన్నారు. చివరికి వాటిని కట్టలేక వ్యాపారుల వేధింపులకు గురి అవుతున్నారని వాపోయారు. అధిక వడ్డీలకు వేధిస్తున్న వ్యాపారులపై పోలీసులు చర్యలు కఠిన తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘం నగరాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం బాషా, ఎస్సీ ఎస్టీ జేఏసీ సంఘాల నాయకుడు సాకే హరి, ఓసీ సంఘర్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం

చెన్నేకొత్తపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకటంపల్లి గ్రామంలో చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొగటవీర క్షత్రియులు, గ్రామస్థులు కలిసి ఈ ఉత్సవాన్ని జరిపారు. తొలుత ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో తొగటవీర క్షత్రియులు తలపై జ్యోతులను పెట్టుకుని నృత్యం చేస్తూ ముందుకు సాగారు. తిలకించడానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.

ఆసక్తిగా మల్టీ డే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

● సెంచరీల జోరు


వినయ్‌కుమార్ , పఠాన్ షరీఫ్ , షేక్ ఇస్మాయిల్, దత్తారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పలువురు క్రీడాకారులు సెంచరీలు చేయడంతో మల్టీ డే క్రికెట్ పోటీలు ఆసక్తిగా మారాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మల్టీడే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం స్థానిక అనంత క్రికెట్ మైదానంలో రెండో రోజూ కొనసాగాయి. అనంతపురం, కడప జట్ల మధ్య జరిగిన పోటీలో మొదట బ్యాటింగ్ చేసిన కడప జట్టు 76.5ఓవర్లలో 273పరుగులకు ఆలౌట్ అయ్యింది. త ర్వాత అనంతపురం జట్టు 87.1ఓవర్లలో 374 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్లు వినయ్‌కుమార్ సెంచరీ (110), దత్తారెడ్డి 82, షేక్ కమిల్ 57, అర్జున్ టెండూల్కర్ 55పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో కడప రెండో రోజు ఆట ముగిసే సమయానికి 6ఓవర్లకు వికెట్ నష్టపోకుండా 31పరుగులు చేసింది. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడగా కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 71.5ఓవర్లలో 250పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి ఇన్నింగ్స్ ప్రా రంభించిన చిత్తూరు 34.5ఓవర్లలో 120పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్నూలు బౌలర్ షేక్ ఇస్మాయిల్ 5వికెట్లు తీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 42.2ఓవర్లలో 118పరుగులకు ఆలౌట్ అయ్యింది. చిత్తూరు బౌలర్ దీవన్ సాయినాథ్ 5వికెట్లు తీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో చిత్తూరు18ఓవర్లలో 2వికెట్లు నష్టానికి 83 పరుగులు చేసింది.

బదిలీల్లోనూ వివక్ష?

అనంతపురం వైద్యం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియలోనూ ఎస్సీ, ఎస్టీలపై వివక్షతను పాటిస్తారా? అని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి అధికారులను ప్రశ్నించారు. స్థానిక ఉద్యానవన శాఖలో ఆదివారం చేపట్టిన బదిలీల ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. బదిలీల్లో అర్హులను వదిలేసి సిఫార్సులున్న వారికి ప్రథమంగా స్థానాలు కేటాయించడమేంటని మండిపడ్డారు. బదిలీల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తున్న హెచ్ఓ రత్నకుమార్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ఈ విషయాలను కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి న్యాపోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, శ్రీనివాసులతోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

తగ్గిన పశువుల సంత ఆదాయం

● గత వారం కంటే రూ.40వేలు తక్కువ

అనంతపురం రూరల్, జూన్29(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం జరిగిన పశులసంత ఆదాయం తగ్గింది. గత వారంతో పోల్చుకుంటే ఈవారం రూ.40వేలు తక్కువ వచ్చింది. గత వారం రెండు రోజుల పశువుల సంతతో రూ.3.82 లక్షలు మార్కెట్ ఖాజానాకు చేరింది. ఈవారం రూ.3.40 లక్షలు వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2.19 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.20 లక్షలు వచ్చిందని వెల్లడించారు.

ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి: ఎంఈఎఫ్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆదివారం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీలలో పనిచేస్తున్న టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే వేతనాలు పెంచాలని అన్నారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు.

ఒంటికాలిపై నిరసన

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ గత పది రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు స్థానిక నగరపాలిక సంస్థ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించేదిలేదని తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, లోకేష్‌నాయుడు, నాయకులు సూర్యనారాయణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రాప్తాడు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. భీమ్‌రావ్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన దళిత సంఘాల నేతలు, ప్రజలు అధికంగా తరలివచ్చారు. స్థానిక సర్పంచ్ తిరుపాలు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గార్లదిన్నె, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ డిమాండ్ చేశారు. దీనిపై 9న తలపెట్టిన సమ్మె పోస్టర్లను స్థానిక పాఠశాలలో ఆదివారం విడుదల చేశారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎంపిక

శింగనమల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా రామాంజనేయులు(సోదనపల్లి), గౌరవాధ్యక్షుడిగా మల్లికార్జున(శివపురం), కార్యదర్శిగా ఓబిలేసు(శివపురం), ఉపాధ్యక్షుడిగా సురేష్(శింగనమల)తో పాటు పలువురు సభ్యులు జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, జిల్లా ఇంచార్జ్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

కుర్రాడు దొరికాడు..

అనంతపురంక్రైం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఐఫోన్ కావాలంటూ అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన కుర్రాడు దాదార్ మహమ్మద్(19)ను అనంతపురం త్రీటౌన్ పోలీసులు ఆదివారం ఎట్టకేలకు వెతికి పట్టుకున్నారు. సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక నిర్మలానంద నగర్‌కు చెందిన దాదార్ మహమ్మ ద్ తన తల్లిదండ్రులు ఐఫోన్ కొని ఇవ్వడం లేదంటూ అలిగి ఈ నెల 28న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో త్రీటౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బాధితుడి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బెంగళూరులో ఉన్నట్టు గుర్తించారు. తర్వాత బెంగళూరు పోలీసుల సహకారంతో ఆ విద్యార్థిని వెతికి పట్టుకున్నారు. తర్వాత కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

మిస్సింగ్ విద్యార్థిని మూడుగంటల్లో గుర్తింపు

అనంతపురం క్రైం: హాస్టల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థినిని మూడు గంటల్లో గుర్తించినట్టు అనంతపు రం టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. కదిరి మండలం పట్నం గ్రామానికి చెందిన మల్లికార్జున(లేట్) కుమార్తె హేమలత(19) నగరంలోని ఓ హాస్టల్లో ఉంటోంది. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో సెకెండ్ ఇయర్ చదువుతోంది. కాగా కుటుంబ తగాదాలతో మేనమామ మందలించాడని శనివారం 7 గంటలప్పుడు హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న ఆమె తాత వెంకటరాముడు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలప్పుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ తాడిపత్రి పోలీసుల సహకారంతో విద్యార్థినిని గుర్తించి ఆమె బంధువులకు అప్పగించారు.

మహిళ అరెస్టు..

అనంతపురంక్రైం: హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఆదివారం సాయంత్రం టూటౌన్ సీఐ శ్రీకాంత్‌యాదవ్ సిబ్బందితో దాడులు చేశారు. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఉప్పర లలితను అరెస్టు చేశారు. ఒక బాధితురాలిని రిస్క్యూ చేశారు. లలితపై కేసు నమోదు చేశారు.

ఎంఎస్ఎస్ కమిటీ ఎన్నిక

అనంతపురంరూరల్, జూన్29(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎస్ ఫర్ రూరల్ అండ్ అర్బన్ పీపుల్ వలంటరీ ఆర్గనైజేషన్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్‌లో ఆదివారం కమిటీని ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా సాధిక్‌వలి, ఉపాధ్యక్షురాలిగా అనూష, కార్యదర్శిగా షె క్షావలి, సహాయకార్యదర్శిగా సునీల్‌కుమార్, కోశాధికారిగా ఇక్రంబాషా, కార్యవర్గ సభ్యులుగా అక్కమ్మ, ఖాజ, జయమ్మ, నాగమణిని ఎన్నుకున్నారు.

శిథిలావస్థలో పల్లెదారులు

● బస్సులు, ఆటోలు వెళ్లలేని దుస్థితి
● బైక్‌పై వెళ్తే ప్రమాదాల బారిన పడుతున్న గ్రామీణులు


కంకరవేసి వదిలేసిన బొమ్మాజీపల్లి రహదారి


కంకర తేలిన కరిగానిపల్లి-అపిలేపల్లి రహదారి

కళ్యాణదుర్గం/కుందుర్పి, జూన్29 (ఆంధ్రజ్యోతి) : కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పల్లెదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కుందుర్పి మండలంలోని ఎనుములదొడ్డి, తెనగల్లు, కరిగానిపల్లి, అపిలేపల్లి, తూముకుంట, జంబుగుంపల, బెస్తరపల్లి, బొమ్మాజీపల్లి, మాయదార్లపల్లి, బసాపురం, నిజవల్లి, మలయనూరు, శ్రీమజ్జనపల్లి, మందలపల్లి, బెస్తరపల్లి, కంబాపల్లి రహదారులు... కంబదూరు మండలంలోని కోటగుడ్డం, జెల్లిపల్లి, రాళ్లపల్లి, రాళ్లఅనంతపురం, ఐపార్శపల్లి రహదారులు గుంతలమయం అయ్యాయి. పదేళ్ల నుంచి వీటి గురించి పట్టించుకున్న నాథుడే లేడు. కంకరతేలి ప్రమాదకరంగా మారాయి. అత్యవసర వైద్యం కోసం ఈ రహదారుల్లో వెళ్తూ నరకయాతన అనుభవిస్తున్నారు.

కుందుర్పి మండలంలోని తెనగల్లు నుంచి కరిగానిపల్లి మీదుగా కుందుర్పికి ఉన్న 10 కిలోమీటర్ల రోడ్డు గుంతలమయం కావడంతో.. బస్సులు, ఆటోలు రావడం లేదు. బైక్‌పై వెళ్లాలంటే సుమారు గంట పడుతోంది. బండమీదపల్లి నుంచి తంబయ్యదొడ్డి మీదుగా బొమ్మాజీపల్లి వెళ్లే తొమ్మిది కిలోమీటర్ల రహదారిలో వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.2 కోట్లతో తారు రోడ్డు వేయడానికి 2020లో శంకుస్థాపన చేశారు. అయితే ఈ రహదారిలో కంకరపరిచి వదిలేశారు. అపిలేపల్లి నుంచి మందలపల్లి వరకు కూడా రూ.1.89 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి కంకరపరిచి వదిలేశారు. అదేవిధంగా జంబుగుంపల నుంచి వెంకటంపల్లి మీదుగా నిజవల్లి వరకు 11 కిలోమీటర్ల వరకు రూ.1.89 కోట్లతో పనులు ప్రారంభించి, ఆ పనులను కూడా మధ్యలోనే వదిలేశారు.

వెళ్లాలంటే నరకం



కరిగానిపల్లి నుంచి కుందుర్పి మీదుగా ఈ రహదారుల్లో వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. పదేళ్ల నుంచి ఈ రహదారి అంతా ఇలాగే ఉంది. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఈ రహదారిని బాగు చేయాలి.

- మోహన్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

రోడ్డంతా గుంతలే



తెనగల్లు నుంచి కుందుర్పికి వెళ్లే రహదారి అంతా గుంతమయం. ద్విచక్రవాహనాల్లో వెళ్తున్న వారు అనేక ప్రమాదాలకు గురై గాయపడ్డారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి.. ఈ రోడ్లను బాగు చేయాలి.

- ఫయాజ్, తెనగల్లు, కుందుర్పి మండలం

మళ్లీ ఖాళీ


ఖాళీగా ఉన్న తహసీల్దారు కుర్చీ

విడపనకల్లు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి తహసీల్దారు స్థానం మళ్లీ ఖాళీ అయింది. నాలుగు రోజుల క్రితం ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన డీ ఓబుళేసు... ఒక్క రోజు మాత్రమే విధులు నిర్వహించి సెలవులో వెళ్లారు. నాలుగు నెలలుగా ఇన్‌చార్జి తహసీల్దారు పాలనలో పనులు సక్రమంగా జరిగేవి కావు. ఓబుళేసును తహసీల్దార్‌గా నియమించడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అంతలోనే ఆయన సెలవులో వెళ్లడంతో వారికి మళ్లీ నిరాశే మిగిలింది.

వృథాగా పడేశారు..!



కళ్యాణదుర్గం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో అనేకమందిని ఆస్పత్రికి చేర్చి.. ప్రాణాలు కాపాడిన 108 వాహనం ఇది. మరమ్మతులకు గురికావడంతో దాన్ని బాగుచేయకుండా కొన్ని నెలలుగా స్థానిక సీహెచ్‌సీ కేంద్రంలో ముళ్లకంపల మధ్య ఇలా వృథాగా పడేశారు. దీంతో అది ఎండకు ఎండి.. వానకు తడిసి.. నేడు ఇలా శిథిలావస్థకు చేరుకుంది. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. దాన్ని బాగు చేసేలా.. లేక దాన్ని విక్రయించేలా స్థానిక అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్యాంకుల నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి, వెలిగొండ గ్రామాల్లో ఓహెచ్‌ఎస్‌ఆర్ (ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్) ట్యాంకుల నిర్మాణాలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, టీడీపీ నాయకులు ఆదివారం వేర్వేరుగా భూమి పూజ చేశారు. బూదగవిలో రూ.35 లక్షలతో ఈ ట్యాంకు నిరిస్తున్నట్లు మాజీ ఎంపీపీ కుళ్లాయప్ప తెలిపారు. అలాగే వెలిగొండలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఐజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిరంజీవి, టీడీపీ నాయకులు రామస్వామి, అఖిల్ పాల్గొన్నారు.


బూదగవిలో పూజ చేస్తున్న నాయకులు

కంది సాగుపై ఆసక్తి

బెళుగుప్ప, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులు కంది పంట సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎర్రనేల భూములు పదునుకావడంతో రెండు, మూడు రోజుల నుంచి ట్రాక్టర్‌తో విత్తనాలు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. బెళుగుప్ప, గుండ్లపల్లి, బెళుగుప్ప తండాలలో రైతులు, విత్తనాలు సాగు మొదలుపెట్టారు. పది రోజులు ముందుగానే సాగుచేస్తున్నారు. మండలంలోని రైతులు రాయదుర్గం, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాలకు వెళ్లి కౌలుకు తీసుకుని ఈ పంట సాగు చేస్తున్నారు. దీనిపై ఏఓ పృథ్వీసాగర్ మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో కంది పంట సాగుకు జూలై 15వ తేదీ వరకు విత్తనాలు వేసుకోవచ్చని, అయితే విత్తనం శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని రైతులకు సూచించారు.


బెళుగుప్ప తండా వద్ద కందిపంట సాగు చేస్తున్న రైతులు

రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు కరువు

గుంతకల్లు నెట్‌వర్క్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్యాసింజరు రైళ్లు మాత్రమే నిలిచే ఈ-కేటగిరి కిందకు వచ్చే చిన్న రైల్వే స్టేషన్లల్లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే టిక్కెట్లు ఎక్కువగా అమ్ముడుపోవన్న కారణంగా ఐదవ కేటగిరి కింద ఉన్న ఈ స్టేషన్ల పట్ల అధికారులు శీతకన్ను చూపుతున్నారు.

● గుంతకల్లు పట్టణ శివారులోని హనుమాన్ సర్కిల్ రైల్వే స్టేషన్‌కు రోజూ వందలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. ఈ స్టేషన్‌లో ప్రయాణికులు కూర్చోవడానికి కనీసం బెంచీలు లేవు. తాగునీటి సౌకర్యం లేదు. ఒక ప్లాట్‌ఫాం నుంచి మరొక ప్లాట్‌ఫాంలోకి వెళ్లేందుకు వంతెన కూడా లేదు. రెండో నెంబర్ ప్లాట్‌ఫారంలో ఏదైనా గూడ్సు రైలు ఉంటే .. పాతగుంతకల్లు, హౌసింగ్ బోర్డు కాలనీవాసులు ఒకటవ నెంబర్ ప్లాట్‌ఫాంలోకి రావాలంటే ఆ గూడ్సు రైలు కింద నుంచి దూరి వెళ్లాల్సిందే. చీకటి పడితే మందు బాబులకు హనుమాన్ సర్కిల్ సర్కిల్ స్టేషన్ కేరాఫ్‌గా మారుతోంది.

● వజ్రకరూరు మండలంలోని గూళ్లపాళ్యం రైల్వే స్టేషన్‌లోనూ రెండు ప్లాట్‌ఫాంలు ఉండగా ఒకదాని నుంచి మరొకదానిలోకి వెళ్లాలంటే ఫుట్ ఓవర్ వంతెన లేదు. రెండో నంబరు ప్లాట్‌ఫాంలో తాగునీటి వసతి లేదు.

● గుత్తి మండలంలోని తురకపల్లి రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాంలో టైల్స్ కుంగిపోయాయి. పురుషులు, వికలాంగుల మూత్రశాలలకు తాళాలు వేశారు. ఈ రైల్వే స్టేషన్‌లో మూడు ప్లాట్‌ఫాంలున్నా.. రెండు చోట్ల మాత్రమే తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే జక్కలచెరువు రైల్వే స్టేషన్‌లో కనీసం బెంచీలు, మరుగుదొడ్లు లేవు. ఒక ప్లాట్‌ఫాం నుంచి మరొక ప్లాట్‌ఫాంకు వెళ్లడానికి వంతెన కూడా లేదు.



తురకపల్లి స్టేషన్‌లో తాళాలు వేసిన మరుగుదొడ్లు


కనీస సౌకర్యాలు లేని హనుమాన్ సర్కిల్ రైల్వే స్టేషన్

చురుగ్గా మైక్రో ఫిల్టర్ ఏర్పాటు పనులు


ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్లు

ఉరవకొండ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద సీపీడబ్ల్యూ స్కీంలో భాగంగా మైక్రో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉరవకొండతో పాటు మరో ఏడు గ్రామాలకు శుద్ధనీటిని అందించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ స్కీంలో ఉన్న ఫిల్టర్ బెడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో అరకొరగానే శుద్ధి నీటిని సరఫరా చేస్తున్నారు. గతంలో దీన్ని పరిశీలించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్... వెంటనే మైక్రో ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో నింబగల్లు సీపీడబ్ల్యూ స్కీం పంప్‌హౌస్ వద్ద రూ.60 లక్షలతో రెండు మైక్రో శాండ్ ఫిల్టర్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు.

వర్షం కోసం నిరీక్షణ


పొలాన్ని శుభ్రం చేస్తున్న కూలీలు

కూడేరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. పొలాలు, విత్తనాలను సిద్ధం చేసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో దాదాపు 12 వేల హెక్టార్లలో వేరుశనగ, కంది, ఆముదం పంటలతో పాటు అంతర్ పంటలు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే పొలాల్లో కంది కొయ్యాలు తొలగించి చదును చేసుకున్నారు. నెల రోజులుగా మేఘాలు ఊరిస్తున్నాయే తప్పా.. వర్షాలు మాత్రం రాలేదు. దీంతో అన్నదాతలు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం

గుత్తి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక మాల్ట్‌స్మిత్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 1974-75లో పదో తరగతి చదివిన విద్యార్థులు 50 సంవత్సరాల తర్వాత అదే పాఠశాలలో సమావేశమయ్యారు. పాఠశాల గదుల్లోకి వెళ్లి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రామకృష్ణ శర్మ, గంగాధర్, నూకల సూరి, రమేష్, బాబా ఫక్రుద్దీన్, నాగరంగ ప్రసాద్, వెంకటేష్, శంకర్ పాల్గొన్నారు.

● గుంతకల్లు : స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో 1987- 90 చదువుకున్న విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఆదివారం అదే కళాశాల వద్ద సమావేశమయ్యారు. విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంసీ బాలయ్యను సన్మానించారు. కార్యక్రమంలో నాటి విద్యార్థులు అన్వర్‌బాషా, తిమ్మయ్య, ఖాదర్ బాషా, మురళి, పురుషోత్తం రెడ్డి, రాజశేఖర్, జ్యోతి, సరళ, అనిత, సువర్ణ, లక్ష్మి, పద్మ, భోగేశ్వరప్ప పాల్గొన్నారు.

● కంబదూరు: స్థానిక ఉన్నత పాఠశాల్లో 1994-95లో పదో తరగతి చదివిన సుమారు 80 మంది విద్యార్థులు 35 ఏళ్ల తర్వాత ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. నాటి గురువులను సన్మానించారు.







న్యూస్ బాక్స్

అమిలినేనిపై ఆరోపణలు మానుకోండి

నారా లోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ రెడ్డి

గుంతకల్లుటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుపైన, ఎస్ఆర్‌సీ సంస్థపైన ప్రతిపక్ష నాయకులు నిరాధార ఆరోపణలు మానుకోవాలని నారా లోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి సూచించారు. స్థానిక డాక్టర్ పత్తి హిమబిందు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మీ సేవ బాబుకు ఎస్ఆర్‌సీ సంస్థకు ఎటువంటి సంబంధమూ లేదని, ఈ-స్టాంపుల కేసులో ఎస్ఆర్‌సీ సంస్థకు ఎస్పీ జగదీష్ క్లిన్ చిట్ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి దబ్బర నారాయణ, నాయకులు బ్రహ్మయ్య, లోకేంద్ర, రామన్న, కదిరప్ప పాల్గొన్నారు.

విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే



తాడిపత్రి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్, వ్యవసాయశాఖమంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు తదితరులను కలిశాడు.

ప్రత్యేక సబ్‌జైలు తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి

గుత్తి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రత్యేక సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ ఆదివారం తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశమయ్యారు. అనంతరం సబ్ జైలులో బ్యారెక్, వంట గది, స్టోర్ రూం, రికార్డులను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, కోర్టు సిబ్బంది సాదిక్ వలి, లోక్‌ఆదాలత్ సిబ్బంది ఉన్నారు.

ప్రతిభావంత విద్యార్థినులకు సన్మానం


మెమెంటోలతో విద్యార్థినులు

గుంతకల్లుటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగ స్వామి దేవాలయంలో కుమ్మర (శాలివాహన) సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన షర్మిల, పుష్ప, లక్ష్మీదేవి, రమ్య విద్యార్థులను ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంఈఓ-2 సుబ్బరాయుడు, ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

బొమ్మనహాళ్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో మొహర్రం వేడుకలకు ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ నబిరసూల్ తెలిపారు. ఆదివారం మండలంలోని గౌనూరు, దర్గాహొన్నూరు, తర్కాపురం తదితర గ్రామాల పీర్ల చావిడి కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శీన, కమల్‌బాషా పాల్గొన్నారు.

● కూడేరు : గ్రామాల్లో మొహర్రం వేడుకలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ రాజు పేర్కొన్నారు. పోలీసుల అనుమతి తీసుకోకుండా పండుగ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేడుకలు ప్రారంభం

యల్లనూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం నుంచి మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. చావిడిల్లో పీర్లకు పూజలు నిర్వహించారు. ఈ వేడుకలు వారం పాటు నిర్వహిస్తారు. మండలంలో దస్తగిరిస్వామి, మస్తాన్‌స్వామి పీర్లకు ప్రత్యేకత ఉంది.

ప్రజాసమస్యలపై పోరే లక్ష్యం: సీపీఐ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

యాడికి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఏ పార్టీ అధికారంలో ఉన్నా... ప్రజల పక్షాన నిరంతర పోరాటం చేయడమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. ఆదివారం యాడికిలో సీపీఐ మండల సమితి మహాసభను మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం నుంచి వెంగమ నాయుడుకాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిర్వహించిన మండల సమితి మహాసభలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ అధికారం కోసం ఎప్పుడూ ఆశ పడలేదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక మంది ప్రాణాలను సైతం త్యాగం చేశారని అన్నారు. ఈ మహాసభలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్, నాయకులు వీకే ప్రదీప్, రజాక్, వడ్డె రాముడు, బండారు రాఘవ, ఓబులరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

లక్ష్మన్న ఆశయాలను కొనసాగిద్దాం


మాట్లాడుతున్న రామకృష్ణ, చిత్రంలో రఘువీరారెడ్డి తదితరులు

కుందుర్పి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు లక్ష్మన్న ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. లక్ష్మన్న ప్రథమ వర్థంతి సందర్భంగా ఆయన వ్యవసాయ పొలంలో స్మారక స్థూపాన్ని ముఖ్య అతిథులు, కుటుంబ సభ్యులు ప్రారంభించారు. రామకృష్ణ, రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. లక్ష్మన్న చదుకునే రోజుల్లోనే అభ్యుదయ భావాలకు ఆకర్షితుడై విద్యార్థి సంఘాల్లో చురుకుగా పనిచేశారన్నారు. ఉపాధ్యాయ వృత్తి అనంతరం కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ కుందుర్పి మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యాయ్యారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్, మాజీ ఎంపీపీ గిరిజమ్మ, ప్రజా గాయకుడు లెనిన్‌బాబు, సీపీఐ నాయకులు సంజీవప్ప, నారాయణ స్వామి, శివరుద్రప్ప, కరియన్న, మహాదేవ, టీడీపీ మండల కన్వీనర్ ధనుంజయ పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డీ.హీరేహాళ్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానికుడు, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు షబ్బీర్ (50) అక్కడికక్కడే మరణించాడు. ఇతను బళ్లారిలో చదువుతున్న తన కూతురును చూడటానికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై వస్తుండగా.. తలకు పెట్టుకున్న హెల్మెట్ కింద పడింది. దాని కోసం ఒక్కసారిగా బైక్ ఆపడంతో.. వెనుక నుంచి వేగంగా వచ్చిన టెంపో అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మరణించాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. షబ్బీర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళకు తీవ్రగాయాలు

గుంతకల్లుటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-మద్దికెర రహదారిలో ఆదివారం ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో కర్నూలు జిల్లా మద్దికెర గ్రామానికి చెందిన ఎరకుల లక్ష్మీ తీవ్రంగా గాయపడింది. ఆ గ్రామానికి చెందిన అలివేలు, స్వాతితో కలసి ఎరకుల లక్ష్మీ ఉల్లిగడ్డల ఆటోలో గుంతకల్లుకు బయలుదేరారు. బుగ్గ సంగాల దేవాలయం వెళ్లే దారి వద్ద గుంతకల్లు నుంచి వేగంగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎరుకుల లక్ష్మీ తీవ్రంగా, మిగిలిన ఇద్దరు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. కారు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. గాయపడిన వీరిని 108 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తలిరంచారు. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి...

పుట్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో ఆదివారం సాయంత్రం బైక్ అదుపుతప్పి అనంతపురానికి చెందిన రామాంజినేయులు గాయపడ్డాడు. తాడిపత్రికి వచ్చిన ఇతను.. తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు అతన్ని ఆసుపత్రికి తరలించారు.

చిరుత దాడిలో ఎనుము దూడ మృతి

శెట్టూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లిలో శనివారం అర్ధరాత్రి రైతు జనార్దన్‌కు చెందిన ఎనుము దూడను చిరుత దాడి చేసి చంపేసింది. దీంతో చిరుత ఎప్పుడు ఎక్కడ దాడి చేస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. చీకటిపడితే ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నామన్నారు.

మద్యం మత్తులో వీరంగం


వాహనాలకు అడ్డుగా పడుకున్న మందుబాబు

యాడికి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. స్థానిక కెనరాబ్యాంక్ ఎదురుగా ప్రధాన రహదారిపై నానా దుర్భాషలాడుతూ పడుకోవడంతో.. ట్రాఫిక్ స్తంభించిపోయింది. స్థానికులు అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

స్టార్టర్ల అపహరణ

పుట్లూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటలో వెంకటరామిరెడ్డికి చెందిన తోటలోని రెండు మోటార్ల స్టాటర్లు ఆదివారం చోరీ అయ్యాయి. వెంకటరామిరెడ్డి మధ్యాహ్నం తోటకు వెళ్లగా.. ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాదాపు రూ.12 వేలు నష్టపోయినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేసి కార్మిక చట్టాలను కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మట్కాబీటర్ అరెస్టు

తాడిపత్రి జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు సమీపంలో ఓ మట్కాబీటర్‌ను ఆదివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అతని నుంచి రూ. 40,570 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని తెలిపారు.